


సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాక, ఓ గంట విశ్రాంతి తీసుకోవడం ఆ తరువాత పేపరు చదవడం నా అలవాటు. నాలుగవ పేజీ చదువుతుంటే మా ఆఫీసరు అప్పలస్వామి వచ్చాడు. ఆయన రాక నన్నాశ్చర్యపరిచింది. ఎందుకంటే మా ఇంటికి ఈ మూడేళ్ళ కాలంలో ఆయన రావడం ఇదే ప్రథమం. ఆఫీసులో మాట్లాడడమేగాని ఇలా ఎవరింటికీ వెళ్ళడం నాకు తెలియదు. హఠాత్తుగా ఇలా మా ఇంటికొచ్చాడంటే ఏదో విశేషమే ఉండాలి మరి!

సాదరంగా ఆయన్ని ఆహ్వానిస్తూ -

"ఏమిటిలా వచ్చారు...?" అని ప్రశ్నించాను.

"ఏం లేదు, నీతో పనిపడిందోయ్!..." అన్నాడాయన. కుర్చీలో కూర్చున్నారు.

"చెప్పండి సార్!" అన్నాను.

అప్పల స్వామి జేబులో నుంచి మూడొందలు తీసి టీపాయ్ మీద పెడుతూ అన్నాడు. "నువ్వు నాకో వంట మనిషిని చూసి పెట్టాలి. నీకు తెలుసుగా - నాకు ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చి రెండేళ్ళు దాటినా ఆఫీసులో స్టాఫ్‌కి మంచి పార్టీ ఇవ్వలేదు. ఈ మధ్య పుణ్య క్షేత్రాలు కూడా దర్శించి వచ్చాను. అందుకని... మిగతా మాటలు పూర్తి చేయకుండా నసిగాడు.

ఆలోచనలో పడ్డాను. అసలే ఈ రోజులు హడావిడిగా ఉన్నాయి. గృహ ప్రవేశాలు, వివాహాలు బాగా జరుగుతున్నాయి. వంట మనుషులు దొరకడం కష్టంగా ఉంది. చిన్న చిన్న కార్యాలకు సామాన్యులు కూడా వంట వారిపై ఆధారపడడం నేర్చుకున్నారు. నాకు తెలుసున్న వారు కాంట్రాక్ట్ పనుల ప్రకారమే చేస్తున్నారు. అంటే వేల మీద ఖర్చు అన్నమాట. అప్పల స్వామి బడ్జెట్ అంత ఉండకపోవచ్చు.

"నాకు ఈ పని నువ్వు ఉచితంగా చేయనవసరం లేదు. ఈ రెండొందలూ ఉంచు" అన్నాడాయన.

"నిజమేననుకోండి! కానీ... ఎవరికి చెప్పాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాను.

అప్పల స్వామికి ఏభై ఆరేళ్ళు వయసుంటుంది బంజారా హిల్స్ దగ్గర మూడంతస్తుల ఇల్లుంది. రెండంతస్తులకు నాలుగు వేలకు పైగా అద్దె వస్తుంది. మూడో అంతస్తులో నాలుగు గదులూ తనుంచుకున్నాడు. ఆయనకు ముగ్గురు కొడుకులున్నారు. అమెరికాలో డాక్టర్లు. ఎప్పుడూ తండ్రి దగ్గరికి రారు. అప్పలస్వామికి భార్య లేదు. ఆ విషయం మీద ఆఫీసులో రక రకాలుగా చెవులు కొరుక్కుంటున్నారు. ఏది నిజమో? ఏది అబద్ధమో! దేవుడికే తెలియాలి. కాఫీ, టిఫిన్, భోజనాల నిమిత్తం రోజుకు అరవై, డెబ్బై రూపాయల దాకా ఖర్చు చేస్తాడు. ఈ విషయాలన్నీ తరచూ నాతో చెప్తుంటాడాయన. నాలాగా ఆయన నుత్తి వినేవాడు నాకు తెలిసున్నంత వరకూ మరెవరూ లేరు.

"ఈ హోటలు మీద ఆధారపడడం ఎందుకు చెప్పండి...?" హాయిగా ఎవరినైనా వంటకు పెట్టుకుంటే మీకూ, వారికీ లాభంగా ఉంటుంది కదా... అనక, ఆరోగ్యం పాడయితే చూసేదెవరు మిమ్మల్ని!" అని కూడా చాలా సందర్భాల్లో అన్నాను.

అప్పల స్వామి జవాబు చెప్పే వాడు కాదు. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోని మనిషి ఇప్పుడు హఠాత్తుగా వచ్చి వంట మనిషి కావాలంటున్నాడు.

తప్పదనుకొని మర్నాడు వంట మనుషుల వేటలో పడ్డాను. ఒకాయన డబ్బు ఎక్కువ అడిగాడు. రెండో ఆయన వీలుపడదన్నాడు. మూడో ఆయన రాను పోను దారి ఖర్చులు అడిగాడు. నాలుగో ఆయన గ్యాస్ స్టౌల మీదగాని చేయనన్నాడు.

కాళ్ళీడ్చుకుంటూ అప్పలస్వామి దగ్గరికి వెళ్ళి ఎఫ్. ఐ. ఆర్. సబ్మిట్ చేశాను.

"వంట వాళ్ళు కూడా పెట్రేగిపోతున్నారయ్యా... ఉద్యోగుల్లాగా షరతులు విధించడం ఏమిటి...?" అన్నాడు అప్పల స్వామి నేను చెప్పినదంతా విన్నాక.

ఇటువంటి విషయాల్లో ఆయన ఎందుకో పిసినారితనం చూపిస్తాడు. పావలా ఖర్చు చేసేచోట పాతికసార్లు ఆలోచిస్తాడు... ఎవరికీ పది పైసలు దానం చేయడు. ఏడు వేల దాకా జీతం వస్తుంది. సిటీ బస్సులో ఆఫీసుకు రాడు. అయిదు కిలో మీటర్ల దూరం నడిచే వస్తాడు. ఉదయం ఏడయితేగాని నిద్ర లేవడు. సాయంత్రం ఏడు దాటితే మెలకువగా ఉండడు. అప్పల స్వామికి వంట వారి పట్ల ఎందుకో సదభిప్రాయం లేదు. మరి ఎందుకో ఈ ఆర్భాటం అనిపించింది నాకు. కేవలం పార్టీ ఇవ్వడానికే అయితే ఏ హోటల్లోనో లంచ్ ఏర్పాటు చేయవచ్చు కదా!...

ఏం చేయాలా అని ఆలోచిస్తుంటే అప్పుడు గుర్తుకొచ్చాడు కేశవరావు... ఆయనకు వంటల్లో ముప్ఫయ్ ఏళ్ళ అనుభవం ఉంది. సొంత ఊళ్ళో గిట్టుబాటు కాక, అక్కడ పోటీకి తట్టుకోలేక పొట్ట చేతపట్టుకుని నగరానికొచ్చాడు, పదిహేనేళ్ళ క్రితం.

కేశవరావు, ఇంటికెళ్ళాను. చేయవలసి పని వివరంగా చెప్పాను. కేశవరావు కాలండరు వైపు చూస్తూ - "ఆ రోజు వీలుపడదు.. మరోచోట ఒప్పుకున్నాను" అన్నాడు.

"అలా అనకండి! అప్పల స్వామి గారు చేస్తున్నది సంతర్పణ. యాత్రలు చేసొచ్చారాయన. పైగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పని మీరు అంగీకరించడమే భావ్యంగా ఉంటుందని నా ఉద్దేశం. ఆయన పని కట్టుకుని మరీ మా ఇంటికొచ్చి చెప్పారు" అన్నాడు.

కేశవరావు ఆలోచిస్తూ - "ఇంతకి ఎంత మందికి చేయాలి... ఏమేం చేయాలి... అనడిగాడు.

"నూట యాభై మందికి చేయాలి. రెండు స్వీట్లు, రెండు కూరలు, పులిహోర, పాయసం... మిగిలిన అయిటమ్స్ ఎటూ మీకు తెలిసినవే..." అని చెప్పాను.

ఆయన లెక్కలు వేసుకుని "ఎనిమిది వందలు

అవుతుంది'' అన్నాడు.

"మరోసారి లెక్క చూడండి'' బేరానికి దిగాను.

"ఓ వంద తగ్గించుకోండి'' అన్నాడు కొంచెం సేపయ్యాక.

"సరే..! అయిదొందలు తీసుకోండి'' అన్నాను.

"అప్పల స్వామి గారికి పని చేయించుకోవడం రాదు. చేసే వాడిని చేయనివ్వరు. ఏదో ఒకటి అంటూనే ఉంటారు. ఆయనకు అనుమానం, చాదస్తం ఎక్కువ. అసలు ఆయనతో ఆఫీసులో ఎలా వేగుతున్నారు మీరు?'' ఆయన గురించి నా కంత తెలుసులే అన్నట్లు ఫోజు ఒకటి.

"ఆ విషయం మనకెందుకు?'' అన్నాను.

"వారితో కుదిరే వ్యవహారం కాదులెండి... మరొకరిని చూడండి'' అనేసారు కేశవరావు...

ఇప్పుడు అప్పల స్వామికి ఏమని చెప్పాలి!... ఇలా ఆలోచిస్తుంటే నాకు సీతమ్మగారు గుర్తుకొచ్చారు. వాళ్ళింటికి బయలుదేరాను మరో గత్యంతరం లేక. ఆవిడతో నా పరిచయం గమ్మత్తుగా, ఆశ్చర్యంగా జరిగింది.

మూడేళ్ళ క్రితం ఓ కాంట్రాక్టరు గృహ ప్రవేశానికి ఆహ్వానించాడు. భోజనాలకు అయిదు వందల మంది దాకా కూర్చున్నారు. భోజనంలో రెండు రకాల పచ్చళ్ళు వడ్డించారు. అవి చాలా రుచిగా, మజాగా ఉన్నాయి. ఆ పచ్చళ్ళ కోసం అడిగిన వారు ఎందరినో నేను గమనించాను. వేటితో తయారు చేశారోగానీ, ఆ విషయం వంట మనిషిని అడగాల్సిందేననిపించింది.

"మీ చేతి భోజనం తినే అదృష్టం, భాగ్యం కలిగింది మాకు. పదార్థాలు చాలా బాగా చేశారు... ముఖ్యంగా పచ్చళ్ళు. ఎన్నోచోట్ల భోజనం చేశాను. కానీ ఇటువంటి తయారీ ఇక్కడే చూడడం. ఇంతకీ అవేం పచ్చళ్ళు... తెలుసుకోవచ్చా...?'' అని అడిగాను కుతూహలంగా.

సీతమ్మగారు నవ్వుతూ - "చాలా సంతోషం నాయనా... భోజనాలు చేసి వెళ్ళిపోయే వారేగానీ - ఇలా వచ్చి చెప్పేవారు ఎవరు?...'' అంది.

"అవేం పచ్చళ్ళు?...''

ఆవిడ చెప్ప సాగింది. ఇప్పుడు కేటరింగు కాంట్రాక్టర్లు రంగంలోకి దిగిపోయారు. అలాగే మెస్సులు కూడా. చదువులు, ఉద్యోగాలు వచ్చాక స్త్రీలకు వంట పనులు చాలామటుకు తగ్గిపోయాయి. ఓ వంట మనిషిని ఏర్పాటు చేసుకోవడమో, హొటల్లోనే భోజనం చేయడమో జరుగుతోంది. కట్నాలు ఇవ్వలేని ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిలు, ఉద్యోగం లేని కుర్రాళ్ళని పెళ్ళాడుతున్నారు - ఇంట్లో ఉండి పనీ-పాటలు చూసుకుంటాడని... సంపాదించి పెడుతోందని... వలచి పెళ్ళాడిందని కుర్రాళ్ళు కూడా కృతజ్ఞతా భావంగానే ఉంటున్నారు.''

"ఆ విషయాలు వదిలేయండి... విషయంలోకి రండి'' అన్నాను.

"అదేమిటి నాయనా... సినిమా చూడబోతూ న్యూస్ రీలు, ప్రకటనలు, స్లైటిల్స్ వెగటవుతాయా'' అంది సీతమ్మ చటుక్కున...

నాకు నోట మాట రాలేదు...

"ఇప్పుడు బజార్లో వంటల పుస్తకాలు, గైడ్లు బాగానే దొరుకుతున్నాయి. యువతీ, యువకులు వాటిని చదివి వంటలు చేస్తున్నారు. ఎటొచ్చీ శ్రమంతా గిన్నెలు తోముకోడంలోనే - అది కూడా మొగుళ్ళే కొన్నిచోట్ల చేస్తున్నారు. పెళ్ళాలిచ్చే సాదరు ఖర్చులాగా ఉపయోగపడుతుందని - ఏం చేస్తాడు పాపం... అటు ఉద్యోగాలు రాక, ఇటు పెళ్ళిళ్ళు అవక...''

ఆమెను అనవసరంగా కదిలించానేమో అనిపించింది... విషయం మొదలుపెట్టి ఎక్కడికో వ్యవహారం వెళుతోంది అనుకొన్నాను.

సీతమ్మ తన ధోరణి కొనసాగించింది... "పెళ్ళయ్యేంతవరకే మొగాడి విలువ, గొప్ప. ఆ మొగాడు మొగుడయ్యాక అంత తలక్రిందులు అవకతవపుదు.''

నాకు కోపం వచ్చింది - "మీ కిష్టమయితే అడిగిన దానికి జవాబు చెప్పండి. లేదంటే వదిలేయండి'' అన్నాను.

"మీరు కోపగించుకోరనే చెపుతున్నాను. ఇది జీవితం. ఇక్కడ కష్ట సుఖాలు, ఆటుపోట్లు, కన్నీళ్ళు, ఎదురు దెబ్బలు ఎన్నో మరెన్నో ఉంటాయి. ఇవన్నీ మీకు తెలియనివి కాదు. ఏదో మీలాంటి వారు ఇలా ఆప్యాయంగా పలకరించినపుడు కడుపులో బాధ, దుఃఖం చెప్పుకుంటాను. వాటిని వినే అవకాశంగా మీరు తీసుకోవాలి'' అంటూ కళ్ళు ఒత్తుకుంది.

సీతమ్మని నొప్పించాననిపించింది.

"ఈ రోజుల్లో సెంటరుకో అరడజనైనా హొటళ్ళు, కాలనీకో పూటకూళ్ళు మెస్సు వెలుస్తున్నాయి. జనాన్ని ఆకర్షించేందుకు రక రకాల పదార్థాలు చేస్తున్నారు - ఏవో పేర్లు పెట్టి తినేవాళ్ళ బలహీనత, వ్యాపార సూత్రం, దౌర్భాగ్యం - సొమ్ము చేసుకుంటున్న రోజులు... కట్టుకున్న పెళ్ళాం ఎంత శుభ్రంగా, బాగా చేసినా మొగుళ్ళకి వెగటుగా ఉంటోంది. పొరుగింటి పుల్లకూర సామెత ఈ మొగుళ్ళకి అక్షరాలా వర్తిస్తుంది. అందుకే కొందరు భార్యలు నోరు మూసుకుని పడుంటున్నారు. మరి కొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరు కిరసనాయిలుతో స్నానం చేస్తున్నారు.''

"పచ్చళ్ళ తయారీలో పరిశోధన బాగా చేసినట్టున్నారు'' అన్నాను టాపిక్ మార్చేందుకు...

సీతమ్మకి నా ఉద్దేశం బోధపడింది కాబోలు - "ఈ డబ్బున్న వాళ్ళకే పిసినారితనం. అందులో ఈ కాంట్రాక్టర్లు వారి బుద్ధి పోనివ్వరు. మోసం చేసి సంపాదించిన డబ్బేగా ఇదంతా... నా చేత ఆయన సొరకాయ చెక్కులు, అరటి కాయ చెక్కులు, పశువులు తినే కొబ్బరి తెలకపిండి వృధా పోనివ్వకుండా చేయించారు. చెప్పినట్టు చేయడమే మా బాధ్యత. లేదంటే బేరాల మాట అటుంచి ఏవో ఉన్నట్టే లేనివి ప్రచారం చేస్తారు. కలికాలం... పురుషాధిక్యత సమాజం కదా... ఆ పచ్చళ్ళు మీ అందరికీ నచ్చాయంటే నా అదృష్టం... ఇంతకన్నా ఏం కావాలి'' అందావిడ.

మొత్తం మీద సీతమ్మ అప్పలస్వామి ఇంట్లో వంటకు అంగీకరించింది - నాలుగొందలకు. ఇద్దరికీ ఆమోదంగా కుదిరిన సొమ్ము. భోజనాలు చేసిన వారు సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తపరిచారు. అప్పలస్వామి ఇంట ఏర్పాటు చేసినందుకు సీతమ్మ ప్రత్యేకంగా నాకు అభినందలు తెలిపింది. నేనే ఆవిడకు డబ్బు ఇస్తుంటే ఎందుకో తీసుకోలేదు. "ఏడాదికోసారి ఇటువంటి సందర్భాల్లో ఉచితంగా వంట చేయడం నాకు అలవాటు'' అంది సీతమ్మ.

అప్పల స్వామికి ఆయనిచ్చిన డబ్బు ఇచ్చేశాను. సీతమ్మ తీసుకోనందుకు, ఈ ఏర్పాట్లకు మాత్రం నేను ఎందుకు తీసుకోవాలి...

అయితే మర్నాడు ఆఫీసుకు వెళ్ళేసరికి... నేనో దారుణమైన వార్త విన్నాను'' అప్పలస్వామికి రాత్రి గుండెపోటు వచ్చిందని... హాస్పిటల్లో చేర్చారని... నాకీ విషయం తెలిపి హాస్పిటలుకి రమ్మనమని...''

హడావిడిగా ఆసుపత్రికి వెళ్ళాను. మంచం మీద పడుకున్న అప్పల స్వామిని చూడగానే నా గుండె తరుక్కుపోయింది. నన్ను చూడగానే ఆయన కళ్ళు చెమర్చాయి. ఇది నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం. ఎందుకంటే ఆయన మొండి మనిషి. ఎవరినీ లెక్కచేయడు. తను పట్టిన కుందేలుకి ఆరు కాళ్ళు అంటాడు. భేషజం, పట్టుదల ఎంతో ఉంది. అప్పలస్వామి నన్ను చూసి లేవబోయాడు. వద్దని వారించాను.

"నాకో సాయం చేయాలి నువ్వు'' అన్నాడాయన.

"చెప్పండి'' అన్నాను.

"మనిషికి గుండె పోటు వచ్చిందంటే అది చావుకు గ్రీన్ సిగ్నల్ కిందే లెక్క. అదృష్టమో... దురదృష్టమో... ఈసారికెలాగో బయటపడ్డాను... ఇన్నేళ్ళు హొటల్లోనే తిన్నాను. ఇక ముందు నా కిష్టం లేదు... అందుకని నాకో వంట మనిషి కావాలి... మన ఇంట చేసిన సీతమ్మను ఒప్పించాలి నువ్వు ఎలాగైనా... ఆమె ఎంత డబ్బు తీసుకున్నా సరే... ఆవిడ సమక్షంలోనే నేను చనిపోవాలి. కనీసం ఈ కొద్ది కాలంలోనైనా ఈ తృప్తి కలిగితే చాలు'' అంటూ చేతులు పట్టుకున్నాడు అప్పల స్వామి.

"ఆవిడ అంగీకరించకపోవచ్చు... ఎందుకంటే ఆవిడకు తీరుబడి ఉండదు. అతి కష్టం మీద మీ ఇంట కుదిర్చాను. అయినా మరొకరిని చూస్తాను. బోలెడు మంది ఉన్నారు నాకు తెలిసిన వాళ్ళు'' అన్నాను.

అప్పల స్వామి భోరున ఏడవసాగాడు. "ఇప్పుడు నాలో రక్త మాంసాలు లేవు. నాలో భేషజం, పట్టుదల, మొండితనం లేవు. నేను పట్టిన కుందేలుకి నాలుగే కాళ్ళు. నాకు లక్షల ఆస్తితో పని లేదు. నాకు తల కొరివి పెట్టే కొడుకుతో పని లేదు. నాకు కావలసింది నా సీత. నాతో ఆరేళ్ళు కాపురం చేసిన నా సీత. నా భార్య సీత. ఆనాటి పరిస్థితులు ఇప్పుడు చెప్పలేను. దయ చేసి నా సీతను తీసుకురా...'' అంటూ నా చేతులు పట్టేశాడాయన.

నాకు అప్పలస్వామి మీద జాలి కలిగింది. ఏ పరిస్థితుల్లో ఆయన తన భార్యను వదలిపెట్టాడో నాకు అనవసరం. ఇప్పుడు ఆయనలో పశ్చాత్తాపం ఉంది. ఆయనకు కావలసింది తోడు... అది సీతమ్మగారే ఇవ్వాలి. మరి ప్రయత్నించాలి కదా గబగబా... సీతమ్మ గారి దగ్గరకు బయల్దేరాను.



**కాంతం:** మీ వారి పుస్తకాలన్నిటిలోనూ మీకు నచ్చిన పుస్తకం ఏది?

**శాంత:** వారి చెక్కు పుస్తకం.

జి.రుక్మిణీ దేవి